క్లుప్తంగా

వేంకటేశ్వర స్వామి కల్యాణం



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే మందుల సామేల్

తిరుమలగిరి : తిరుమలగిరి మున్సిపల్ కేంద్రంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు ముప్పిరాల రఘువర్ధన్, వెంకటరమణాచార్యులు కల్యాణ మహోత్సవాన్ని జరిపించారు. వేడుకల్లో శాసన సభ్యులు మందుల సామేల్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో దేవాలయ చైర్మన్ గొట్టిపర్తి వెంకటేశ్వరరావు, భక్తులు పాల్గొన్నారు.

మిషన్ భగీరథ సర్వే పరిశీలన



అడివెంలలో నిర్వహిస్తున్న సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ సందీప్‌కుమార్

అర్వపల్లి : మిషన్ భగీరథ పథకంపై నిర్వహిస్తున్న సర్వేను మండల పరిధిలోని అడివెంల గ్రామంలో ఆదివారం ఎంపీడీఓ డి.సందీప్‌కుమార్ పరిశీలించారు. రోజుకు 50 ఇళ్ల చొప్పున కార్యదర్శులు సర్వే చేయాలని సూచించారు. ప్రతి ఇంట్లో మిషన్ భగీరథ నీళ్లు వస్తున్నాయా.. లేవా అనే విషయాన్ని తెలుసుకొని యాప్‌లో నమోదు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మహాలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు కళమ్మ, సరోజ, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పాల సంఘం చైర్మన్‌గా పోడేటి మల్లయ్య



మల్లయ్యను సన్మానిస్తున్న రవీందర్‌రావు

తుంగతుర్తి : తుంగతుర్తి మండల కేంద్రంలోని పాల ఉత్పత్తిదారుల పరస్పర సహకార సంఘం చైర్మన్‌గా పోడేటి మల్లయ్య ఆదివారం ఎన్నికయ్యారు. ఈ మేరకు బీజేపీ నాయకుడు సంకినేని రవీందర్‌రావు నూతన చైర్మన్‌గా ఎన్నికైన పోడేటి మల్లయ్యను, పూర్వపు చైర్మన్లను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మల్లయ్య మాట్లాడుతూ సొసైటీ బలోపేతానికి, పాల ఉత్పత్తిదారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఎన్నికకు సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా బోనాల పండుగ



బోనాలతో వస్తున్న మహిళలు

మునగాల : మండలంలోని బరాఖత్‌గూడెంలో బోనాల పండుగను గ్రామప్రజలు ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు పెద్దఎత్తున బోనాలతో ర్యాలీగా వెళ్లి గ్రామదేవతలకు నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

స్కాలర్‌షిప్‌కు ఎంపిక

మేళ్లచెరువు : మండలంలోని రామాపురం జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు నాగతేజ, శ్రీరామ్‌చరణ్ నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం మధు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన విద్యార్థులు నాలుగు సంవత్సరాల పాటు సంవత్సరానికి రూ.12వేలు పొందనున్నట్లు వెల్లడించారు.

పెండింగ్ వేతనాలు ఇవ్వాలి



ఎన్నికైన నూతన కమిటీ సభ్యులు

మఠంపల్లి : గ్రామపంచాయతీల్లో పనిచేస్తున్న ఎంపీడబ్ల్యూ వర్కర్ల పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు సయ్యద్‌రన్‌మియా కోరారు. ఆదివారం మండలంలోని రఘునాథపాలెంలో పంచాయతీ వర్కర్ల సంఘం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నెలల తరబడి కార్మికులకు వేతనాలు చెల్లించకపోతే వారి జీవనం గడిచేది ఎలా అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. అనంతరం సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. నూతన గ్రామశాఖ అధ్యక్షుడిగా షేక్ మహమూద్, ఉపాధ్యక్షుడిగా సయ్యద్‌హమీద్, కార్యదర్శిగా షేక్ నాగుల్‌మీరాతోపాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. సమావేశంలో సంఘం సీనియర్ నాయకుడు, మండల కమిటీ సభ్యుడు గురువారెడ్డి, సయ్యద్‌రహీం, అమరారపు సంతోషం, సామేల్, లక్ష్మీనారాయణ, కాంతమ్మ, నాగమణి, రమణ, మోషా, సాయికుమార్, సయ్యద్‌తాజు పాల్గొన్నారు.

అస్తవ్యస్తంగా ఆలయ పునర్నిర్మాణం

- చిన్నపాటి వర్షానికే కారుతున్న మండపం
- పూర్తి స్థాయిలో అభివృద్ధి పనులు చేపట్టాలని భక్తుల వినతి



పునర్నిర్మించిన అర్వపల్లి ఆలయం



పూర్తిగా శిథిలమైన రథశాల



ఆలయంలోని 40 కాళ్ల మండపం పై భాగంలో వర్షానికి కారుతున్న నీళ్లు

అర్వపల్లి : జిల్లాలో ప్రసిద్ధిగాంచిన అర్వపల్లిలోని శ్రీయోగానంద లక్ష్మీనర్సింహస్వామి ఆలయ పునర్నిర్మాణ పనులు అస్తవ్యస్తంగా మారాయి. ఆలయం పూర్తిగా శిథిలం కావడంతో ఈ ఆలయ పునర్నిర్మాణం కోసం 2012లో సీజీఎఫ్ నుంచి రూ.40 లక్షలు మంజూరయ్యాయి. దీనికి తోడు 2016లో జాజిరెడ్డిగూడేనికి చెందిన నీటి పారుదల శాఖ ప్రభుత్వ మాజీ సలహాదారు రామరాజు విద్యాసాగర్‌రావు కోరిక మేరకు అప్పటి సీఎం కేసీఆర్ రూ. కోటి మంజూరు చేశారు. కాగా ఈ నిధులతో ఆలయ పునర్నిర్మాణ పనులు చేపట్టారు. అయితే కాంట్రాక్టర్ పనులను జాప్యం చేయడంతోపాటు సరిగా చేయకపోవడంతో చిన్నపాటి వర్షాలకే 40 కాళ్ల మండపం కురుస్తోంది. మండపం పైభాగంలో స్లాబ్‌పై వర్షపు నీరు నిలిచి నీళ్లు కారుతున్నాయి. దీంతో ఆలయానికి వచ్చే భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. పునర్నిర్మాణంలో భాగంగా పాత ఆంజనేయస్వామి ఆలయాన్ని తొలగించారు. కొత్తగా హనుమాన్ ఆలయం నిర్మించాల్సి ఉంది. ఈ ఆలయం నిర్మించక హనుమాన్ విగ్రహాన్ని ఆరుబయటే ఉంచారు. అర్వపల్లి ఆలయాన్ని మరింత అభివృద్ధి చేయడానికి శాసనసభ ఎన్నికలకు ముందు అప్పటి ఎమ్మెల్యే గాదరి కిషోర్ కుమార్ రూ. 5కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. అయితే ఈ లోపు ఎన్నికలు రావడంతో నిధుల మంజూరు నిలిచిపోయింది. ఈ ప్రభుత్వ హయాంలోనైనా ఆలయాన్ని అభివృద్ధి చేయాలని భక్తులు కోరుతున్నారు.

మరమ్మతులు చేయాలి



అర్వపల్లిలోని లక్ష్మీనర్సింహస్వామి ఆలయం అభివృద్ధి పనులు గత 14 ఏళ్లకు పై నుంచి జరుగుతున్నాయి. కానీ ఇంత వరకు ఈ పనులు పూర్తి కాలేదు. ప్రస్తుతం వర్షాలకు ఆలయం కురుస్తోంది. కాంట్రాక్టర్ వెంటనే తగు మరమ్మతులు చేయాలి.

– చెన్న రమేష్, భక్తుడు, అర్వపల్లి

పనులు చేయిస్తాం



వర్షానికి 40 కాళ్ల మండపం కొన్ని చోట్ల కురుస్తోంది. ఈ విషయాన్ని కాంట్రాక్టర్ దృష్టికి తీసుకెళ్లి మరమ్మతులు చేయిస్తాం. గత ప్రభుత్వ హయాంలో రూ. 5కోట్లతో ఆలయ అభివృద్ధికి ప్రతిపాదనలు పంపారు.

– వై. శ్రీనివాస్‌రెడ్డి, ఈఓ

సంతోషిమాత ఆలయ బ్రహ్మోత్సవాలు



బ్రహ్మోత్సవాలకు హాజరైన భక్తులు

భానుపురి : పట్టణంలోని సంతోషిమాత ఆలయంలో ఆలయ బ్రహ్మోత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రతిష్ఠాపన జరిగి 28 ఏళ్లు పూర్తయిన సందర్భంగా దేవాలయ ప్రధాన అర్చకుడు ఇరువంటి శివరామకృష్ణశర్మ తెల్లవారు జాము నుంచే ప్రత్యేక పూజలు చేశారు. సత్యసాంబశివుడు, లక్ష్మీగణపతి, ఆంజనేయస్వామి, సంతాన నాగదేవత, మానసదేవి దేవతామూర్తులకు ప్రత్యేక పంచామృత అభిషేకాలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా కలశస్థాపన పూజ, పుణ్యాహవాచనం, మండపారాధన పూజలు చేపట్టారు. మహిళలు సామూహికంగా కుంకుమార్చన, మల్లెల పూజ, గాజుల పూజ, పుసుపుకొమ్ముల పూజ చేశారు. రుద్ర, లలితా గణపతి హోమం, మహాపూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో దేవాలయ అధ్యక్ష, కార్యదర్శులు నూక వెంకటేశంగుప్త, బ్రహ్మాండ్లపల్లి మురళీధర్, కోశాధికారి రాంమూర్తి, సభ్యులు ప్రకాష్, అశోక్, మల్లికార్జున్, సోమయ్య, వెంకటేశ్వర్లు, బ్రహ్మయ్య, ఉపేందర్, లింగారెడ్డి, రవిశంకర్, శివప్రసాద్, ముత్యాలమ్మ, పద్మ, కవిత, లీల, సూర్యకళ, ప్రభావతి, రత్నమాల, కనకరత్నం పాల్గొన్నారు.

రాష్ట్రంలో విద్యకు అధిక ప్రాధాన్యం



తిరుమలగిరి పాఠశాలలో మీటింగ్ హాల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మందుల సామేల్

తిరుమలగిరి : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తోందని, ప్రతి గ్రామంలో ప్రభుత్వ పాఠశాల ఉండే విధంగా చూస్తోందని తుంగతుర్తి శాసన సభ్యుడు మందుల సామేల్ అన్నారు. తిరుమలగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సంకెపల్లి ఈశారెడ్డి జ్ఞాపకార్థం రూ.15 లక్షలతో నిర్మించిన మీటింగ్ హాల్‌ను ఆదివారం తెలంగాణ రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ సభ్యుడు సంకెపల్లి సుధీర్‌రెడ్డితో కలిసి ప్రారంభిరచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. విద్యా దానం గొప్పదని తెలిపారు. తిరుమలగిరిలో అతి త్వరలోనే జూనియర్ కళాశాల ప్రారంభమవుతుందని, 40 ఏళ్ల కల సాకారమవుతుందని అన్నారు. అనంతరం దాత సంకెపల్లి విజయారెడ్డిని, కుటుంబ సభ్యులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ శాగంటి అనసూయరాములు, పీఏసీఎస్ చైర్మన్ పాలెపు చంద్రశేఖర్, మండల విద్యాధికారి ఐ.శాంతయ్య, మండల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, శ్రీనివాస్‌రెడ్డి, సుమన్‌రెడ్డి, పాలకుర్తి రాజయ్య, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

సుధాకర్ మృతి కళారంగానికి తీరనిలోటు



సుధాకర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మందుల సామేల్

నాగారం : తెలంగాణ సాంస్కృతిక ఉద్యమకారుడు చిప్పలపల్లి సుధాకర్(డప్పు సుధాకర్) మృతి కళారంగానికి తీరనిలోటని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో సుధాకర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సంతాప సభలో పాల్గొని మాట్లాడారు. తెలంగాణ ఉద్యమ సమయంలో డప్పు సుధాకర్ తన ఆట, పాటల ద్వారా ఎంతో మందిని ఉద్యమంవైపు మళ్లించాడని అన్నారు. కళాకారుల కుటుంబాలకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని తెలిపారు. అనంతరం డప్పు సుధాకర్ పాటల సీడీని ఆవిష్కరించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, రూ.50,000 ఆర్థికసాయం అందజేశారు. నాన్న ఫౌండేషన్ వ్యవస్థాపకుడు వనగండ్ల సైదులు రూ.10,000 ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా గాయకులు ఏపూరి సోమన్న, వేముల పుష్ప, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తొడుసు లింగయ్య, మంగదుడ్ల దశరథ, జాజుల వీరయ్య, కొలిపాక సాయికుమార్, సాంస్కృతిక సారధి కళాకారులు గిద్ద రామన్నయ్య, వేముల నరేష్, మేర్నాళ్ల కిషోర్, మద్దెల సందీప్, పాలకుర్తి శ్రీకాంత్‌గౌడ్, గడ్డం ఉదయ్, పాక ఉపేందర్, దారమల్ల రమేష్, మందుల విజయ్, కూరం లింగయ్య, మల్లిక, అనుదీప్, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు జాజిరెడ్డిగూడేనికి ఎమ్మెల్యే సామేల్ రాక

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకుడు గుడిపల్లి మధుకర్‌రెడ్డి స్వచ్ఛందంగా రూ.3లక్షలతో నిర్మించిన పీర్లకొట్టం ప్రారంభోత్సవానికి సోమవారం తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ రానున్నారని కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు దాసరి సోమయ్య ఆదివారం తెలిపారు. ప్రారంభోత్సవం అనంతరం గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద అన్నదాన కార్యక్రమం ఉంటుందని తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

బహిరంగ సభను విజయవంతం చేయాలి

ఆత్మకూర్ (ఎస్) : ఆత్మకూరు మండల పరిధిలోని ముక్కుడుదేవులపల్లి గ్రామంలో సీపీయూఎస్‌ఐ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించే బహిరంగ సభను విజయవంతం చేయాలని సీపీయూఎస్‌ఐ దళిత బహుజన శ్రామిక విముక్తి సూర్యాపేట జిల్లా నాయకుడు బయ్యా వెంకన్న ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. కులవర్గ పోరాట సిద్ధాంతకర్త మారోజు వీరన్న స్ఫూర్తితో బహుజన రాజ్యాధికారమే లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు. వీరన్న ఆశయ సాధనకు నిరంతరం ప్రజలను చైతన్యం చేస్తున్నామని పేర్కొన్నారు.

గ్రామీణ వైద్యులను ప్రభుత్వం గుర్తించాలి



మాట్లాడుతున్న జిల్లా ఆర్గనైజర్ డాక్టర్ లక్ష్మణ్

అర్వపల్లి : గ్రామాల్లో ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందిస్తున్న గ్రామీణ వైద్యులను ప్రభుత్వం గుర్తించాలని ఆర్‌ఎంపీ, పీఎంపీ అసోసియేషన్ జిల్లా ఆర్గనైజర్ డాక్టర్ జేరిపోతుల లక్ష్మణ్ కోరారు. అర్వపల్లిలో ఆదివారం జరిగిన ఆర్‌ఎంపీ, పీఎంపీ వేల్ఫేర్ అసోసియేషన్ తుంగతుర్తి జోనల్ కమిటీ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్‌ఆర్ ప్రభుత్వ హయాంలో గ్రామీణ వైద్యులకు తగు శిక్షణ ఇచ్చి గుర్తింపు కార్డులు ఇచ్చారని చెప్పారు. ఆ ప్రక్రియను ప్రస్తుత ప్రభుత్వం కూడా తిరిగి కొనసాగించాలని కోరారు. గ్రామీణ వైద్యులపై నేషనల్ మెడికల్ కౌన్సిల్ దాడులను అరికట్టాలని విజ్ఞప్తి చేశారు. గ్రామీణ వైద్యులకు తగు శిక్షణ ఇచ్చి వారి సేవలను ప్రభుత్వం వాడుకోవాలని అన్నారు. మండల అధ్యక్షుడు మద్దెల రవి అధ్యక్షతన జరిగిన ఆరు మండలాల కమిటీ సమావేశంలో జోనల్ కోశాధికారి పులుసు శేఖర్, పప్పుల వెంకన్న, బొమ్మగాని యాదగిరి, వెంకటేశ్వర్లు, వెంకటనారాయణ, నాగరాజు, బాసాని లక్ష్మయ్య, గడ్డం వెంకన్న, అంజయ్య, కామేశ్వర్‌రావు, గుర్రం నరేష్, వెంకన్న, కడియం వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ పరికరాలు ఇవ్వాలి

నడిగూడెం : వానాకాలం సీజన్ ప్రారంభమైనందున రైతులకు రాయితీపై వ్యవసాయ పరికరాలను మంజూరు చేయాలని రైతు సంఘం నాయకుడు ఏనుగుల వీరాంజనేయులు ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొద్ది సంవత్సరాలుగా వ్యవసాయ యాంత్రీకరణ పథకం కింద పరికరాలు మంజూరు కాకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. యంత్రాలు, పరికరాలు మంజూరు చేయాలని కోరారు.

ఎన్నికల హామీల అమలు కోసం పోరాడాలి



మాట్లాడుతున్న కోట గోపి

తుంగతుర్తి : ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై, ఎన్నికల్లో ప్రజలకిచ్చిన హామీల అమలు కోసం పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కోట గోపి పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలోని రిటైర్డ్ ఉద్యోగుల భవనంలో జరిగిన నియోజకవర్గ స్థాయి రాజకీయ శిక్షణ తరగతుల కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలకు సంబంధించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై పోరాటాలను ఉధృతం చేయాలన్నారు. పేద ప్రజలకు నిత్యావసర సరుకుల ధరలను అందుబాటులో ఉంచాలన్నారు. నిరంకుశ విధానాలను అవలంభించే ప్రభుత్వాలకు ప్రజలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు చెరుకు యాకలక్ష్మి, జిల్లా కమిటీ సభ్యులు బుర్ర శ్రీనివాస్, కందాల శంకర్‌రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ములకలపల్లి రాములు, వజ్జె శ్రీనివాస్, కల్లేపల్లి భాస్కర్, కడియం కుమార్, నాయకులు అంతయ్య, దేవరకొండ యాదగిరి, గడ్డం ఎల్లయ్య, సావిత్ర, వసంత, జానయ్య, గుడిపాటి వెంకులు, గోవిందా చారి, ఉప్పల సోమయ్య, బ్రహ్మాచారి, మీనయ్య, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మకూర్ (ఎస్): సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు



నాగారం జెడ్పీహెచ్‌ఎస్‌లో ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

ఆత్మకూర్ (ఎస్) : సూర్యాపేట మండలం యండ్లపల్లి గ్రామానికి చెందిన జెడ్పీహెచ్‌ఎస్ 1994–95 బ్యాచ్ పదవ తరగతి విద్యార్థులు ఆదివారం నెమ్మికల్ దండుమైసమ్మ ఆలయం సమీపంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించుకున్నారు. కుటుంబ సమేతంగా ఈ కార్యక్రమానికి హాజరై నాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. అప్పటి గురువులైన రాఘవరెడ్డి, సులోచన, వెంకటేశ్వర్లు, సురేందర్‌రెడ్డి, కృపాకర్‌రెడ్డిలను సత్కరించారు.

నాగారం : మండలం కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1991–92టెన్త్ బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకొని, ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. విద్యాబోధన చేసిన గురువులను శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. అలాగే సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుదర్శన్, రామలింగం, నారాయణ, రామచంద్రయ్య, పద్మనాభ రవీందర్‌రెడ్డి, పూర్వ విద్యార్థులు బయ్యం వెంకన్న, ఎల్క సైదులు, దోమల వెంకన్న, అనంతుల సత్తయ్య, ఆకారపు భాస్కర్ పాల్గొన్నారు.

ప్రపంచ మానవాళికి కమ్యూనిజమే సరైన మార్గం

మునగాల : ప్రపంచ మానవాళికి కమ్యూనిజమే సరైన మార్గమని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కొలిశెట్టి యాదగిరిరావు అన్నారు. ఆదివారం మండలంలోని రేపాలలో మునగాల, నడిగూడెం మండలాలకు చెందిన పార్టీ సభ్యులకు నిర్వహించిన రాజకీయ శిక్షణ తరగతుల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమ చరిత్రతో పాటు సీపీఎం ఏర్పడిన తీరును ఆయన వివరించారు. అనంతరం డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కోట రమేష్ మాట్లాడారు. పార్టీ ప్రజాసంఘాల నిర్మాణ అంశాన్ని, భవిష్యత్ కర్తవ్యాలను తెలియజేశారు. ఈ శిక్షణ తరగతులకు ప్రిన్సిపాల్‌గా పార్టీ మండల కార్యదర్శి చందా చంద్రయ్య వ్యవహరించారు. శిక్షణ తరగతుల్లో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మేదరమెట్ల వెంకటేశ్వరరావు, పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు బెల్లంకొండ సత్యనారాయణ, దేవరం వెంకటరెడ్డి, దేశిరెడ్డి జ్యోతి, మండల కార్యవర్గ సభ్యులు బచ్చలకూర స్వరాజ్యం, వీరబోయిన వెంకన్న, జూలకంటి విజయలక్ష్మి, షేక్ సైదా, జూలకంటి కొండారెడ్డి, దేశిరెడ్డి స్టాలిన్‌రెడ్డి, ఎనుగుల వీరాంజనేయులు, కాసాని కిశోర్, రమేష్, సతీష్, మండవ వెంకటాద్రి, ఉపేందర్, గోపయ్య, గోగిరెడ్డి వెంకటరెడ్డి, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యం కోసమే ఉచిత వైద్యశిబిరం



టేకుమట్లలో రోగులకు వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ బెల్లంకొండ ప్రియాంక

సూర్యాపేట : ప్రజల ఆరోగ్యం కోసమే ఉచితంగా మెగా వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు డాక్టర్ బెల్లంకొండ ప్రియాంక తెలిపారు. ఆదివారం సూర్యాపేట మండలంలోని టేకుమట్ల గ్రామంలో ఆర్వీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. మండలంలోని టేకుమట్ల గ్రామంలో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి మంచి స్పందన వచ్చినట్లు ఆమె తెలిపారు. 300మందికి అవసరమైన అన్ని పరీక్షలు, మందులు ఉచితంగా అందజేశామని అన్నారు. ఆర్వీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో 24గంటలు డాక్టర్లు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బెల్లంకొండ భరత్‌కుమార్, డాక్టర్ క్రాంత్, బెల్లంకొండ రామ్మూర్తి, అలుక ప్రశాంత్‌గౌడ్, సురేష్, ఆర్‌ఎంపీ కుసుమ సిద్ధారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆశ్రమం కూల్చిన వారిపై చర్యలు తీసుకోవాలి



కూల్చిన ఆశ్రమాన్ని పరిశీలిస్తున్న ట్రస్టు సభ్యులు

సూర్యాపేట : యండ్లపల్లి గ్రామ సమీపంలోని శ్రీ రామానంద ఆశ్రమాన్ని కూల్చిన వారిపై చర్యలు తీసుకోవాలని శ్రీ రామనంద ఆశ్రమం ట్రస్టు అధ్యక్షుడు ఉయ్యాల లచ్చయ్య అన్నారు. ఆదివారం బజరంగ్ దళ్, విశ్వ హిందూ పరిషత్ నాయకులు, ఆశ్రమం ట్రస్ట్ సభ్యులు కలిసి ఆశ్రమాన్ని సందర్శించి మాట్లాడారు. యండ్లపల్లి గ్రామానికి గుండా అనంతలక్ష్మి ప్రోద్బలంతో పంతంగి కృష్ణయ్య, పంతంగి మల్సూర్, పంతంగి సాయికుమార్, ఉయ్యాల ఆదినారాయణలు శనివారం అర్ధరాత్రి జేసీబీలతో అక్రమంగా ఆశ్రమాన్ని కూల్చివేశారని అన్నారు. ఎన్నో ఏళ్లుగా ఆశ్రమంలో స్వామివార్ల కల్యాణ వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నామని, అలాంటి ఆశ్రమాన్ని కూల్చిన వారిపై చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీరామనంద ఆశ్రమం ట్రస్టు ఉపాధ్యక్షుడు ఉప్పు శ్రీనివాస్, గౌరవ అధ్యక్షుడు కుంట్ల భిక్షంరెడ్డి, బజరంగ్ దళ్ స్టేట్ కో కన్వీనర్ కన్నెబోయిన వెంకట్, విశ్వ హిందూ పరిషత్ నాయకులు సుధాకర్, విజయ్‌కృష్ణ, గ్రామస్తులు సుదర్శన్‌రెడ్డి, రవి, నవీన్, అంజయ్య, యాదయ్య, శ్రీరాములు పాల్గొన్నారు.

కేసీఆర్‌కు నోటీసులు ఇవ్వడం తగదు



నిరసన తెలుపుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

అర్వపల్లి : మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను అప్రతిష్టపాలు చేయడానికే విద్యుత్ కమిషన్ నోటీసులు ఇచ్చిందని బీఆర్‌ఎస్‌వీ రాష్ట్ర నాయకుడు గంగదేరి వెంకట్ విమర్శించారు. విద్యుత్ కమిషన్ నోటీసులు ఇవ్వడాన్ని నిరసిస్తూ మండల పరిధిలోని కొమ్మాలలో అంబేద్కర్ విగ్రహం ఎదుట ఆదివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీల ప్రకారం రైతులకు ఎకరాకు రూ. 15వేల చొప్పున వానాకాలం పంటకు రైతు భరోసా నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్‌ఎస్‌పై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాచకొండ యాదగిరి, ఉప్పలయ్య, బయ్య కృష్ణ, దుదిగామ సంపత్, బాసాని తిరుపతయ్య, సురారపు వంశీ, యల్లయ్య, యాకయ్య, యుగేంధర్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

తీరిన గిరిజనుల రహదారి కష్టాలు

- ఎన్నో ఏళ్ల పోరాట ఫలితంగా జీటీ రోడ్డు నిర్మాణం
- రూ.89.10 లక్షలతో పూర్తయిన పనులు



గన్నెనాయక్‌తండాకు నిర్మించిన బీటీరోడ్డు

అర్వపల్లి : ఎన్నో ఏళ్ల పోరాట ఫలితంగా గన్నెనాయక్ తండాకు బీటీ రోడ్డు నిర్మాణం జరిగింది. ఇప్పటి వరకు ఉన్న గుంతలమయమైన ఫార్మేషన్ రోడ్డుతో తండావాసులు అనేక కష్టాలు పడ్డారు. అయితే గత ప్రభుత్వ హయాంలో ఈ తండాకు బీటీ నిర్మాణం కోసం ప్రతిపాదనలు పంపగా శాసనసభ ఎన్నికలకు ముందు నిధులు మంజూరయ్యాయి. కాగా అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో టెండర్ ప్రక్రియ నిలిచిపోయింది. అయితే ఇటీవల టెండర్ ప్రక్రియను పూర్తి చేసి బీటీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు.

రూ.89.10 లక్షలతో పనులు..

కొమ్మాల పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి గన్నెనాయక్‌తండా వరకు 1.1 కిలోమీటర్ల రోడ్డుకు ఎస్టీ ఎస్‌డీఎఫ్ నుంచి రూ.89.10 లక్షలతో బీటీ నిర్మాణం చేపట్టారు. దీంతో తండాకు పక్కారోడ్డు నిర్మాణం పూర్తయింది. బీటీరోడ్డు నిర్మాణంతో తండావాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

కష్టాలు తీరాయి



మా తండావాసులం ఎన్నో ఏళ్లుగా చేస్తున్న పోరాట ఫలితంగా బీటీరోడ్డు నిర్మాణం ఎట్టకేలకు పూర్తయింది. అయితే ఇప్పటి వరకు తండాకు రోడ్డు లేక రాకపోకలకు అనేక ఇబ్బందులు పడ్డాం. మా తాత, ముత్తాతల నుంచి రోడ్డు కోసం పోరాడుతున్నాం.

– డెకావత్ లింగయ్య, రైతు

ఇబ్బందులు ఉండవు



ఇదివరకు చిన్నపాటి వర్షం పడినా రోడ్డు సరిగా లేక రాకపోకలకు ఇబ్బందులు పడ్డాం. ఇక పెద్ద వర్షాలు కురిసినా మాకు ఎలాంటి ఇబ్బంది లేదు. తండా నుంచి నిమిషాల్లో బయటకు ప్రయాణం చేసేలా బీటీరోడ్డు నిర్మాణం చేపట్టారు.

– వీరన్న, తండావాసి

సేవలు అభినందనీయం

మునగాల : వాసవీక్లబ్ గ్రేటర్స్ మునగాల, కేసీజీఎఫ్ ఫ్యామిలీ స్టార్ ఆధ్వర్యంలో చేపడుతున్న సేవలు అభినందనీయమని వాసవీక్లబ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ మిత్తింటి శారద అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని వాసవీక్లబ్‌లో డాన్ టు డెస్క్ (సూర్యోదయం నుంచి సూర్యాస్తమయం వరకు సేవా కార్యక్రమాలు) నిర్వహించారు. ఈ సందర్భంగా వాసవీక్లబ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ మిత్తింటి శారద పాల్గొని పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. విద్యార్థులకు స్టేషనరీ, వృద్ధులకు చేతికర్రలు, పండ్లు పంపిణీ చేశారు. పాఠశాలలో వాటర్ ట్యాంకు నిర్మాణం చేపట్టారు. పోలీస్‌స్టేషన్‌లో సిబ్బందికి మాస్కుల పంపిణీ, దేవాలయాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. నేత్ర అవయవదాన పత్రాల సేకరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో వాసవీక్లబ్ రీజనల్ చైర్మన్ గుండా సుధామాధురి, ఐపీసీ గుండా ఉపేందర్, సోమ పద్మ, జెడ్సీ వనమా అనురాధ, ఆర్ఈసీ బిక్కుమళ్ల లక్ష్మి, వాసవీక్లబ్ మండల శాఖ అధ్యక్షుడు కాపర్తి మణికంఠకుమార్, తోట రమాదేవి, దేవరశెట్టి శ్వేత, చిల్లంచర్ల సమత, అర్వపల్లి ప్రవీణ్, కందిబండ సంతోష్ ఆర్య వైశ్య ప్రముఖులు పాల్గొన్నారు.



విద్యార్థులకు స్టేషనరీ పంపిణీ చేస్తున్న సభ్యులు